క్లుప్తంగా

రక్తదానం.. ప్రాణదానం



రక్తదానం చేస్తున్న యువకులు

ఆమదాలవలస: ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి అపాయంలో ఉన్నవారి ప్రాణాలను కాపాడాలని కృత్విక్ స్వచ్ఛంద సేవా సంస్థ ఫౌండర్ చిగురుపల్లి చిన్ను, డాక్టర్ వినోద్ కుమార్ అన్నారు. కృత్విక్ ఫౌండేషన్, డాక్టర్ వినోద్ కిడ్స్ హాస్పిటల్ సహకారంతో ఆదివారం ఆమదాలవలస పట్టణంలో గల సువ్వారి కల్యాణ మండపంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 85 మంది యువకులు పాల్గొన్ని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు పి.తాతయ్యలు, సీపాన హేమమోహన్, సి.హెచ్.సుధాకర్, వైద్య సిబ్బంది నవ్య, కృష్ణ, దీప, స్వచ్ఛంద సంస్థ సభ్యులు బగాది నేతాజీ, కృష్ణ, బమ్మిడి రాములు, యశ్వంత్, వసంత్, ప్రశాంత్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్, సభ్యులు

నరసన్నపేట: స్థానిక మార్కెట్ కమిటీ పాలకవర్గం ఆదివారం ప్రమాణ స్వీకారం చేసింది. కమిటీ చైర్మన్‌గా పాగోటి ఉమామహేశ్వరి, వైస్ చైర్మన్‌గా గొర్లె ఎర్రయ్య, పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కమిటీ కార్యదర్శి రజినీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ పాగోటి ఉమామహేశ్వరి మాట్లాడుతూ నరసన్నపేట మార్కెట్ కమిటీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం సమావేశం నిర్వహించారు. నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌తో రక్షణ

ఆమదాలవలస: శక్తి యాప్ ద్వారా మహిళలు అత్యవసర సమయంలో సేవలు పొందవచ్చని శక్తి టీమ్ ఎస్ఐ జి.వాసుదేవరావు, టీమ్ సభ్యుడు, ఏఎస్ఐ డి.రమణమూర్తి అన్నారు. జ్యోతిరావు పూలే బాలికల కళాశాల, పాఠశాల విద్యార్థినులకు శక్తి యాప్‌పై ఆదివారం అవగాహన కల్పించారు. అత్యవసర సమయంలో 100, 112, 181, 1091, 1098, 1930, 1972 టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేయాలన్నారు. పోక్సో యాక్ట్‌ను వివరించారు. బాల్య వివాహాలు చేయడం నేరమన్నారు. కళాశాల, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి నియమాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ మహ్మమ్మద్ యాసిన్

హిరమండలం: వాహనాలు నడిపేటప్పుడు రహదారి నియమాలు పాటించాలని ఎస్ఐ మహ్మమ్మద్ యాసిన్ అన్నారు. ఆదివారం కోరాడ కూడలిలో వాహనదారులకు అవగాహన కల్పించారు. హెల్మెట్, పత్రాలు, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు. త్రిబుల్ రైడింగ్, మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రమాదాల నివారణకు రహదారి నియమాలు పాటించాలన్నారు.

కుంగిన కల్వర్టు



కుంగిన కల్వర్టు వద్ద హెచ్చరికను ఏర్పాటు చేసిన స్థానికులు

కొత్తూరు: మండలంలోని ఏబీ రోడ్డులో నిత్యం రద్దీగా ఉన్న కలిగాం కూడలి వద్ద ఉన్న కల్వర్టు ఇటీవల కుంగింది. వాహనాల రాకపోకలకు సమస్యగా మారింది. వాహనదారులు అప్రమత్తంగా లేకపోతే ప్రమాదం పొంచి ఉంది. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి ప్రమాదాలు జరగక ముందే కల్వర్టును బాగుచేయాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

దహన సంస్కారాలకు రూ.పది వేలు అందజేత

కొత్తూరు: మండలంలోని మెట్టూరు బిట్-3 ఆర్ఆర్ కాలనీలోని పెద్దసంకలి గ్రామానికి చెందిన జన్ని రాములు ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆ కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా మాజీ కార్యదర్శి పరామర్శించారు. పేద కుటుంబ కావడంతో దహన సంస్కారాలకు అదే కాలనీకి చెందిన బూర్లె శ్రీనివాసరావు రూ.పది వేలు అందజేశారు. పేద కుటుంబం కావడంతో దహన ఖర్చులకు ఇబ్బంది లేకుండా ఉండాలన్న ఆలోచనతోనే ఆర్థిక సాయం చేసినట్లు శ్రీనివాసరావు తెలిపారు. పరామర్శించిన వారిలో పార్టీ కార్యకర్తలు అదపాకల లక్ష్మణరావు, కృష్ణారావు, రౌతు సోమేశ్వరరావు, బాలు, రాజశేఖర్, పతివాడ తిరుపతిరావు, బుడ్డు, నేతాజీ, ధర్మారావు ఉన్నారు.

యాప్‌లతో అవస్థలు



సారవకోట ప్రాజెక్టులో సూపర్‌వైజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు (ఫైల్)

- ఇచ్చింది గోరంత.. పని కొండంత
- అంగన్‌వాడీలకు పెరిగిన పని ఒత్తిడి
- నేడు కార్యాలయాలకు ఫోన్లు అందజేత..

సారవకోట: అంగన్‌వాడీ కార్యకర్తలపై పని ఒత్తిడి అధికంగా ఉండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నరసన్నపేట నియోజకవర్గంలో సారవకోట, నరసన్నపేట ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో నరసన్నపేట, పోలాకి, సారవకోట, జలుమూరు మండలాల్లో 431 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. మెయిన్ అంగన్‌వాడీ కార్యకర్తలకు నెలకు రూ.11,500, మినీ కార్యకర్తలకు రూ.7 వేలు, ఆయాలకు రూ.7 వేలు గౌరవ వేతనం అందిస్తున్నారు. వీళ్లపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రాల నిర్వహణ, లబ్ధిదారులకు పోషకాహారం సరఫరా చేసేందుకు తీసుకొచ్చిన యాప్‌లతో విసిగిపోతున్నారు. ఈ నెల 4వ తేదీన గతంలో అందించిన ఫోన్లను సంబంధిత ఐసీడీఎస్ కార్యాలయాలకు అప్పగించేందుకు సిద్ధమయ్యారు.

పనిచేయని యాప్‌లు..

కేంద్రాల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బాల సంజీవని యాప్, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పోషణ ట్రాకర్ యాప్‌తో కార్యకర్తలు అవస్థలు పడుతున్నారు. ఈ యాప్‌లు సరిగా పనిచేయడం లేదు. కేంద్రానికి వచ్చినప్పుడు, వెళ్లినప్పుడు ఫేస్ అథంటికేషన్ వేయాల్సి రావడంతో.. కేంద్రంలో ఉన్నా వేరేచోట ఉన్నట్లు జియో లోకేషన్ చూపించడంతో అవస్థలు పడుతున్నారు. పోషణ ట్రాకర్ యాప్‌లో గర్భిణి, బాలింత, టీహెచ్ పిల్లల వివరాలు నమోదుతోపాటు వారికి ఎఫ్ఆర్ఎస్, ఈకేవైసీ, ఆధార్ ఫేస్ మ్యాచింగ్ చేయాలి. కొంత మంది లబ్ధిదారుల ఎప్పుడో చిన్నప్పుడు ఫొటోతో ఆధార్ కార్డుతో ఇప్పుడు పోషణ ట్రాకర్ యాప్‌లో నమోదు చేసుకునేందుకు అవకాశం లేదు. ఆధార్ అప్‌డేట్ చేయాల్సిన పరిస్థితి వచ్చింది. వీటిని చేసేందుకు గతంలో ఇచ్చిన ఫోన్లు సహకరించకపోవడంతో సొంతంగా డబ్బులు పెట్టుకుని ఫోన్లు కొనుగోలు చేయాల్సి వస్తుంది. ప్రతి నెలా కేంద్రాలకు పాలు సరఫరా చేసేందుకు ఏర్పాటు చేసిన మిల్క్ యాప్, రాష్ట్ర ప్రభుత్వం మూడో శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర - స్వచ్ఛంధ్ర కోసం ఉన్న యాప్‌లో ఫొటోలు అప్‌లోడ్ చేయలేకపోతున్నామని, తమకిచ్చే చాలీచాలని వేతనాలతో బారెడు చాకిరీ చేయాల్సి వస్తోందని అంగన్‌వాడీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

త్వరలో మరో యాప్..

ఇప్పటివరకు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఉన్న పీఎంఎంవీవై (ప్రధాన మంత్రి మాతృ వందన యోజన) పథకానికి సంబంధించిన యాప్ త్వరలో కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కార్యకర్తలకు అప్పగించనుంది. ఇప్పటికే ఉన్న యాప్‌లతో సతమతం అవుతున్నారు. తమపై పనిభారం తగ్గించాలని, సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

నరసన్నపేట నియోజకవర్గంలో అంగన్‌వాడీ కేంద్రాల వివరాలు..				
మండలం	సారవకోట	జలుమూరు	నరసన్నపేట	పోలాకి
మెయిన్	63	93	92	95
మినీ	32	05	23	28

ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి



కేంద్రాల నిర్వహణకు ప్రవేశపెట్టిన యాప్‌లు మోరాయించడం, నిత్యం ఫోన్లో డాటా నమోదు చేయడం, తీవ్రమైన ఒత్తిడి కారణంగా ఆరోగ్య సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. వేతనం తక్కువ ఇస్తున్నారు. పలు రకాల యాప్‌లతో తీవ్రమైన పని ఒత్తిడి పెంచుతున్నారు.

– దీన రత్నమణి, అంగన్‌వాడీ యూనియన్ కార్యవర్గ సభ్యురాలు, డీఎల్‌పురం

డేటా నమోదు చేయలేకపోతున్నాం



రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు గతంలో కేంద్రాల నిర్వహణకు ప్రభుత్వం ఇచ్చే ఫోన్లను ప్రాజెక్టు కార్యాలయాలకు అందజేసేందుకు నిర్ణయించుకున్నాం. పనిచేయని ఫోన్లలో డేటా నమోదు చేయలేకపోతున్నాం. అటు కార్యాలయ సిబ్బంది నుంచి, ఇటు లబ్ధిదారుల నుంచి ఒత్తిడి ఎదుర్కొంటున్నాం.

– బి.శ్రీదేవి, అంగన్‌వాడీ యూనియన్ కార్యవర్గ సభ్యురాలు, అల్లాడ

ఆక్రమణ పరిశీలన



ఇంటి స్థలాన్ని పరిశీలిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

జలుమూరు: మండలంలోని టెక్కలిపాడులో దళితుడైన డి.రమణకు గతంలో ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలాన్ని అదే గ్రామానికి చెందిన చెంచల కృష్ణమూర్తి ఆక్రమించి వ్యవసాయ భూమిగా మార్చుకున్నాడని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు ఆర్.సురేష్‌బాబు ఆరోపించారు. ఆక్రమణకు గురైన స్థలాన్ని ఆదివారం పరిశీలించారు.

ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ.. 1976లో అప్పటి ప్రభుత్వం నివాస స్థలంగా పట్టా ఇచ్చిందని, 1996 ప్రభుత్వ ఆర్థికసాయంతో రమణ ఇంటిని కూడా నిర్మాణం చేశాడన్నారు. మిగిలిన స్థలం ఆక్రమణకు గురైందని, దీనిపై గత కొన్ని నెలలుగా ప్రభుత్వ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ న్యాయం జరగలేదన్నారు. రమణకు అండగా ఉంటామని ప్రజా సంఘాల నాయకులు గంగరాపు సింహాచలం, కాల నరిసింహులు, సవరయ్య, టి.మోహనరావు అన్నారు.

కొమ్మలు కొట్టి.. రోడ్డుపైనే విడిచిపెట్టి..



ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా రహదారిపై పడేసిన చెట్టు కొమ్మలు

ఆమదాలవలస: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా ఉన్న రహదారిపై విద్యుత్ శాఖ అధికారులు గత మూడురోజుల క్రితం విద్యుత్ లైన్లకు అడ్డంగా ఉన్నాయని చెట్ల కొమ్మలు కొట్టించారు. ఆ కొమ్మలు ఆదివారం వరకు రహదారిపైనుంచి తొలగించకపోవడంతో ప్రయాణికులు, స్థానికులు ఇక్కట్లకు గురవుతున్నారు. చెట్లు కొమ్మలు నరికిన వెంటనే వాటిని తొలగించే బాధ్యత కూడా విద్యుత్ శాఖ అధికారులు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే రహదారిపైనే విడిచిపెట్టడంతో ప్రమాదాలకు గురవుతున్నామని ప్రయాణికులు తెలిపారు.

ఎరువులు అందజేయండి



మాట్లాడుతున్న ఎంపీపీ రాణా ఈశ్వరమ్మ

మెళియాపుట్టి: సక్రమంగా ఎరువులు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఎరువులు అందుబాటులో ఉండేవిధంగా చూడాలని పలువురు సభ్యులు అన్నారు. ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రాణా ఈశ్వరమ్మ అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పలు శాఖలకు సంబంధించిన వివరాలను అధికారులు తెలియజేశారు. మండలంలోని ఎత్తైన గిరిశిఖర గ్రామాల్లో ఇళ్ల వద్దకే వెళ్లి రేషన్ సరుకులు అందించాలని, అదేవిధంగా ఉత్తరాంధ్రలోనే ఎత్తైన గిరిజన గ్రామం చందనగిరిలో రేషన్ డిపో ఏర్పాటు చేయాలని కోరారు. ఆర్టీసీ అధికారులు గత కొన్నిరోజుల నుంచి సమావేశాలకు గైర్హాజరవడంపై సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. పలు శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. ఎంపీపీ మాట్లాడుతూ.. సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. ఎంపీడీఓ నరసింహప్రసాద్ పండా, తహసీల్దార్ పాపారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు మోహనరావు, బైపోతు ఉదయ్‌కుమార్, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

'చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించండి'



సరుబుజ్జిలి: కొండవలసలో క్యూఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న చింతాడ రవికుమార్ వైఎస్సార్‌సీపీ నాయకులు

సీఎం చంద్రబాబు మోసాలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్, పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. సరుబుజ్జిలి మండలంలోని కొండవలస, బూర్జ మండలంలోని జంగాలపేట గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ, రికాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమానికి చింతాడ రవికుమార్ హాజరయ్యారు. కొండవలస సర్పంచ్ లావేటి విశ్వేశ్వరరావు, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి సురవరపు నాగేశ్వరరావు, పార్టీ బూర్జ మండల అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు, బద్రి రామారావు, పున్నపురెడ్డి తవిటినాయుడు, మూడడ్ల రమణ పాల్గొన్నారు. నరసన్నపేట మేజరు పంచాయతీలోని 6, 7, 8, 9వ వార్డులో పార్టీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు కేసీహెచ్‌బీ గుప్త, ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు ఆధ్వర్యంలో, పోలాకి మండల కేంద్రంలో డీసీసీబీ మాజీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, మండల పరిషత్ సలహాదారు ముద్దాడ బైరాగినాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు కణితి కృష్ణారావు ఆధ్వర్యంలో, జలుమూరు మండలంలోని జోనంకి గ్రామంలో ఎంపీపీ వాన గోపి, పార్టీ మండల అధ్యక్షుడు కనుసు సీతారాం, జిల్లా కార్యదర్శి మొజ్జాడ శ్యామలరావు, జిల్లా బూత్ కమిటీ అధ్యక్షుడు దామ మన్మధరావు, నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు జి.వి.రమణి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కొత్తూరు మండలంలోని పారాపురం, గూనభద్ర (ఆర్ఆర్ కాలనీ), నీలకంఠాపురం గ్రామాల్లో పార్టీ మండల అధ్యక్షుడు గండివలస ఆనందరావు, ఎంపీపీ సవర సావిత్రి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ ఆధ్వర్యంలో, పొందూరు మండలంలోని తుంగపేట, గోరింట, గోకర్నపల్లి, తాడివలస, లచ్చయ్యపేట, బొడ్డేపల్లి, నందివాడ గ్రామాల్లో పార్టీ మండల అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, జెడ్పీటీసీ సభ్యుడు లోలుగు కాంతారావు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ మోసాలను వివరించారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



పోలాకి: బాబుష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



జలుమూరు: జోనంకిలో క్యూఆర్ కోడ్‌ను చూపిస్తున్న ఎంపీపీ గోపి, వైఎస్సార్‌సీపీ నాయకులు



కొత్తూరు: గూనభద్ర ఆర్ఆర్ కాలనీలో క్యూఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పొందూరు: క్యూఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



నరసన్నపేట: బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు



సరుబుజ్జిలి: బూర్జ మండలం జంగాలపేటలో క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న చింతాడ రవికుమార్, నాయకులు

ఇలా ఉంటే వ్యాధులు రావా..



సారవకోట మండలంలోని అవలింగి గ్రామంలోని కూరాకుల వీధిలో జనావాసాల మధ్య అపారిశుద్ధ్యం నెలకొంది. ఈ వీధిలో సుమారు 40 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. వర్షం నీరు, ఇళ్లల్లోని వాడుక నీరు బయటకు వెళ్లే మార్గం లేదు. దీంతో దోమలు, ఈగలు పెరిగి వ్యాధులు ప్రబలుతున్నాయి. మురుగునీరు దాటుకుంటూ ఇళ్లల్లోకి వెళ్లాల్సి వస్తోంది. అధికారులు స్పందించి మురుగునీటి కాలువలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. - సారవకోట

గోతులమయం..



సారవకోట నుంచి కిడిమి వెళ్లే రహదారిలో భారీ గ్రానైట్ లారీలతో రోడ్డు పాడైంది. చోడసముద్రం, కిడిమి గ్రామాలకు సమీపంలో నాలుగు గ్రానైట్ క్వారీలు, చిప్స్ క్వారీ ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో పీఎం గ్రామ సడక్ యోజన పథకంలో భాగంగా రోడ్డు నిర్మించారు. సాధారణ వాహనాలు మాత్రమే వెళ్లాలి. భారీ వాహనాల రాకపోకలతో రోడ్డు పూర్తిగా అధ్వానంగా తయారైంది. ఇటీవల కిడిమి వద్ద భారీ లారీలను అడ్డుకున్నారు. రోడ్డు పూర్తిగా పాడవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని స్థానికులు, ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. - సారవకోట

జంగిల్ క్లియరెన్స్ చేయరూ..



పాతపట్నం మండలంలోని తెంబూరు-బడ్డుమర్రి ఐటీడీఏ రోడ్డుకు ఇరువైపులా తుప్పలు విపరీతంగా పెరిగిపోయాయి. దీంతో మలుపుల వద్ద ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రోడ్డులో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పలను తొలగించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు. - పాతపట్నం

కదలవు.. మెదలవు..



పాతపట్నంలోని ప్రధాన రహదారిపై పశువులను బహిరంగ ప్రదేశాల్లో యజమానులు విడిచిపెట్టేస్తున్నారు. పగలు, రాత్రీ తేడా లేకుండా రహదారులపై తిష్ట వేసి వాహనాల రాకపోకలకు అంతరాయం కల్పిస్తున్నాయి. పార్కింగ్ చేసిన వాహనాల్లో ఉన్న ఆహార పదార్థాలు, కూరగాయలు తినేస్తున్నాయి. కోర్టు, శివశంకర్ కాలనీ, ఆల్ ఆంధ్ర రోడ్డు, మార్కెట్ యార్డ్, బ్రాహ్మణ వీధి కూడళ్లలో పశువులు తిష్ట వేస్తున్నాయి. పంచాయతీ సిబ్బంది దీనిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. - పాతపట్నం

తాగునీరు వృథా



ఎల్.ఎన్.పేట గ్రామంలో మెగా రక్షిత మంచి నీటి పథకం నుంచి తాగునీరు వృథాగా పోతుంది. ప్రస్తుతం వర్షాలు లేక ప్రజలు అవస్థలు పడుతుంటే.. సక్రమంగా వినియోగించుకోవాల్సిన తాగునీరు వృథా అవుతుంది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. - హిరమండలం

చేతివృత్తులను ప్రోత్సహించాలి



పాత హిరమండలంలో చేతివృత్తుల వారితో మాట్లాడుతున్న అధికారులు

హిరమండలం: మండలంలోని సుభలయ, పాతహిరమండలం, మేదర వీధుల్లో నాబార్డ్ జిల్లా డెవలప్‌మెంట్ మేనేజర్ కృష్ణ, మెప్మా పీడీ రాముడు ఆదివారం పర్యటించారు. గిట్టుబాటు ధర లేక ఆర్థికంగా అవస్థలు పడుతున్నామని ఆయా వీధులకు చెందిన చేతివృత్తుల కార్మికులు నాబార్డ్ అధికారులకు వివరించారు. చేతివృత్తుల వారికి ప్రభుత్వం తరపున శిక్షణ ఇప్పించి ప్రోత్సాహం అందించాలని కోరారు. మార్కెట్‌లో గిట్టుబాటు ధరలు కల్పించాలని విన్నవించారు. ఆయా వీధులకు చెందిన నాయకులు పాల్గొన్నారు.